

యథావిధిగా ఎన్‌టిఆర్ వైద్య సేవలు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రభుత్వంతో ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలు జరిపిన చర్చలు ఫలించడంతో శనివారం నుంచి డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం అన్ని ప్రయివేటు ఆసుపత్రుల్లో యథాతథంగా అమలవుతుందని ఎన్‌టిఆర్ వైద్య సేవా పథకం జిల్లా సమన్వయాధికారి పి.ప్రియాంక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి పథకం సేవలను పొందాలన్నారు. జిల్లాలో మొత్తం 45 ప్రయివేటు ఆసుపత్రుల్లో ఈ పథకం ద్వారా ఉచిత వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా వైద్య సేవలను ఉపయోగించుకోవాలన్నారు.

హాస్టల్‌లో భోజనం.. పాఠశాలల్లో నిద్ర

'తూర్పు'లో ఎస్‌సి హాస్టళ్ల పరిస్థితి
శిథిల భవనాలతో విద్యార్థుల ఇక్కట్లు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఎస్‌సి సంక్షేమ హాస్టల్‌లో వసతులు కల్పన విద్యార్థులకు అందని ద్రాక్షలా మారింది. ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్ సొంత జిల్లాలోనే ఈ పరిస్థితి నెలకొనడం విశేషం. కూటమి ప్రభుత్వం 14 నెలల పాలనలో సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేశామని, విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చామంటూ 'తల్లికి వందనం' ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పదేపదే ప్రకటనలు నీటి మీద రాతల చందమని ఎస్‌సి హాస్టల్స్‌ను సందర్శిస్తే తేటతెల్లం అవుతోంది.

తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 37 ఎస్‌సి సంక్షేమ హాస్టల్స్ ఉన్నాయి. వాటిలో బాలికల హాస్టళ్లు 15 కాగా, బాలుర హాస్టళ్లు 22 ఉన్నాయి. వీటిలో 8 హాస్టల్స్ శిథిలావస్థకు చేరుకోగా మరో 2 హాస్టళ్లు పూర్తిగా మూత పడ్డాయి. ఈ లెక్కన ప్రస్తుతం కేవలం 27 హాస్టల్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ హాస్టల్స్‌లో బాలురు 806 మంది, బాలికలు 1,005 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం 21 హాస్టల్స్‌కు మరమ్మతులు జరుగుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి మరమ్మతులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాల్సిన పాలనా యంత్రాంగం పూర్తి నిర్లక్ష్యం వ్యవహరించింది. ఈ నేపథ్యంలో హాస్టల్స్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులను పాఠశాలలకు, ఇతర హాస్టళ్లకు తరలించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉండ్రాజవరంలో ఉన్న ఎస్‌సి బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే స్లాబు నుంచి నీరు కారుతోంది. ప్రస్తుతం ఈ వసతిగృహంలో 20 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు తాత్కాలిక వసతి కోసం ఉండ్రాజవరం ఎంపిపి నెంబర్-2 పాఠశాలను అధికారులు కేటాయించారు. ఆ ప్రాంత వాసులు దీనికి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ప్రస్తుతం ఉండ్రాజవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాత్రి బస చేస్తున్నారు. ఉదయమే లేచి తిరిగి వారు హాస్టల్‌కు వెళ్తున్నారు. స్నానాలు, అల్పాహారం చేసి తరువాత బడికి వెళ్తున్నారు. సాయంత్రం తిరిగి హాస్టల్‌కు వెళ్లి రాత్రి భోజనం అనంతరం నిద్రించేందుకు ఉన్నత పాఠశాలకు వెళ్తున్నారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న అన్ని హాస్టళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కొంత మందిని ఇతర హాస్టళ్లకు పంపించగా మరికొంత మందిని దగ్గరలో ఉన్న పాఠశాలలో వసతిని ఏర్పాటు చేస్తున్నారు.



ఉండ్రాజవరంలో శిథిలావస్థలో ఉన్న ఎస్‌సి బాలుర వసతి గృహం

వసతుల లేమితో ఇక్కట్లు...

సరైన వసతులు లేక ఎస్‌సి హాస్టళ్లలో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకే గదిలో 30 నుంచి 50 మంది వరకు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వారి సామగ్రిని ఉంచుకునేందుక, పడుకునేందుకు సరిపడా స్థలం లేక ఇరుకు గదుల్లో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దాదాపు అన్ని హాస్టల్స్‌లో నేలపైనే విద్యార్థులు నిద్రపోవాల్సిన పరిస్థితి నెలకొంది. బాలుర వసతి గృహాల్లో బాత్‌రూమ్‌లు లేకపోవడంతో ఆరుబయటే విద్యార్థులు సామూహిక స్నానాలు చేస్తున్నారు. 27 హాస్టళ్లలో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు సిబ్బంది లేరు. దీంతో విద్యార్థులే మరుగుదొడ్లను శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి. కొన్ని చోట్ల వార్డెన్లు సొంత నిధులతో మరుగుదొడ్లు శుభ్రం చేయిస్తున్నారు. ప్రతి నెలా పారిశుధ్య కార్మికుని రూ.15 వేల వరకూ చెల్లిస్తున్నారు. మరో ఆరు హాస్టల్స్‌కు వంట చేసే వారు లేరు. మరో నాలుగు హాస్టళ్లకు కమాటీలు లేరు. 10 హాస్టల్స్‌కు వాచ్‌మెన్లు సైతం నేటికీ నియమించలేదు.



నేలపైనే నిద్రిస్తున్న రాజమహేంద్రవరంలోని ఎస్‌సి హాస్టల్ విద్యార్థులు

ప్రతిపాదనలు పంపించాం...

ఉండ్రాజవరంలో ఎస్‌సి హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకున్న విషయం మా దృష్టికి వచ్చింది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నూతన భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాం. తుపాను నేపథ్యంలో కొంత మంది విద్యార్థులను ఇళ్లకు పంపించేశాం. మిగిలిన విద్యార్థులకు స్థానికంగా ఉన్న పాఠశాలలో వసతి కల్పించాం. నిధులు రాగానే నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తాం.

- ఎన్ మేరీమాత,
అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, కొవ్వూరు



వాక్‌థాన్‌లో పాల్గొన్న ఒఎన్‌జిసి సిబ్బంది, విద్యార్థులు

విజిలెన్స్ అవేర్నెస్‌పై ఒఎన్‌జిసి వాకథాన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ ప్రచారంలో భాగంగా ఒఎన్‌జిసి రాజమండ్రి అసెట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎవి.అప్పారావు రోడ్ నుంచి ఒఎన్‌జిసి బేస్ కాంప్లెక్స్ వరకూ వాక్‌థాన్‌ను నిర్వమించారు. ఈ కార్యక్రమంలో ఒఎన్‌జిసి ఉద్యోగులు, ఎపిఎస్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసెట్ మేనేజర్ శాంతను దాస్ మాట్లాడారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాటంలో సమిష్టి చర్యను పెంపొందించే లక్ష్యంతో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను నిర్వహిస్తుందన్నారు. ఒఎన్‌జిసి తన అన్ని కార్యకలాపాల్లో పారదర్శకత, సమగ్రతను కొనసాగించడానికి పలు చర్యలు తీసుకుందన్నారు. బాధ్యతాయుతమైన పిఎస్‌యుగా ఒఎన్‌జిసి పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ధృఢమైన పోరాటానికి వేదికను ఏర్పాటు చేస్తుందన్నారు. బ్యానర్లు, పోస్టర్లు ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తుందన్నారు. నవంబర్ 2 అవేర్‌నెస్ వీక్ పూర్తవుతుందన్నారు. ఈ ప్రచారంలో భాగంగా ఒఎన్‌జిసి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించామన్నారు. వీధినాటకాల ద్వారా పలు ప్రాంతాల్లో అవగాహన కల్పించామన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : గిరజాల

ప్రజాశక్తి-కడియం

ఇటీవల సంభవించిన మొంథా తుపాను వల్ల రైతులకు విపరీతమైన నష్టం వాటిల్లిందని, వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, మండల అధ్యక్షులు వై.స్టాలిన్ డిమాండ్ చేశారు. శుక్రవారం గిరజాల బాబు ఇంటి వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బాబు మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం రైతులకు ఉచిత పంటల బీమా చెల్లించక పోవడాన్ని తీవ్రంగా విమర్శించారు. ఉచిత పంట బీమా చెల్లించి ఉంటే పంట నష్టం రైతులకు వుండేది కాదన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఉచిత పంట బీమా ద్వారా రైతులను ఆదుకుందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయబోమంటూ రైతులను భయాం దోళనకు గురిచేయడం తగదన్నారు. గత ప్రభుత్వంలో కౌలు రైతులకు ఎన్నో రాయితీలు ఉండేవని, కానీ ప్రస్తుతం అధికారులు ఎకరా మించి కౌలు చేసే రైతులను మాత్రమే కౌలు రైతులుగా గుర్తించడం దుర్మార్గమన్నారు. ఈ ఉత్తర్వులను రద్దుచేసి రైతులను ఆదుకోవాలని లేదంటే రైతులందరూ రోడ్డుమీదకు వచ్చి ఉద్యమాలు చేసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, ఈలి గోపాలం, మార్గాన్ని బలరాం, పున్నమి రాజు వీర్రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గిరజాల బాబు



అరటి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

ముంపునకు గురైన తోటలు పరిశీలన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తుపాను కారణంగా కురిసిన వర్షాలకు ముంపునకు గురైన తోటలను శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించింది. కొవ్వూరు ఉద్యాన అధికారి డి.సుధీర్ కుమార్, వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రేఖ, డాక్టర్ అర్చన ఉండ్రాజవరం, తాడిపర్రులో ముంపుకు గురైన అరటి, కూరగాయల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అరటి తోటలో నీటిని వెంటనే బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తయారైన గెలలను కొట్టి, వెంటనే మార్కెట్‌కి తరలించాలన్నారు. టమోటా, వంగ, మిర్చి, కాలీఫ్లవర్, దోసకాయ, బీరకాయ, కాకరకాయ ఇతర కూరగాయలు నష్టాన్ని తగ్గించుకోవడానికి తగిన జాగ్రత్తలు తెలిపారు. వేలివెన్నులో దెబ్బతిన్న వరి పంటను కొవ్వూరు ఎడిఎ సిహెచ్.శ్రీనివాస్ పరిశీలించారు. నష్టం అంచనాలను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు, గ్రామ ఉద్యాన సహాయకులు ఎస్.జగదీశ్వరి, వై.దీప్తి, విఎఎ రిషి పాల్గొన్నారు.

పాడైన రోడ్లను బాగు చేయిస్తాం

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - పెరవలి, నిడదవోలు రూరల్

తుపాను ప్రభావంతో నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లను బాగుచేయిస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తుపాను ప్రభావంతో దెబ్బత్తి రోడ్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. కానూరు-ఉసులుమర్రు ఆర్ అండ్ బి రోడ్డును పరిశీలించారు. రూ.3 కోట్లతో ఈ రోడ్డును సిసి రోడ్డుగా మారుస్తామన్నారు. ఇప్పటికే ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. వర్షాలు తగ్గిన నేపథ్యంలో పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అలాగే రూ.3.24 కోట్లతో చివటం, ఉండ్రాజవరం- తాడిపర్రు గ్రామాలను కలుపుతూ వడ్లూరు- తీపర్రు రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. కాల్దారి రోడ్డుకు రూ.60 లక్షలు మంజూరు చేయించామన్నారు. దమ్మెన్ను, మోర్త, ఉండ్రాజవరం గ్రామాలను కలుపుతూ నిర్మించే కానూరు-లంకలకోడేరు రోడ్డుకు రూ.4.20 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయన్నారు. సిఎం, డిసిఎంలతో మాట్లాడి నియోజకవర్గంలో రోడ్లకు రూ.8.30 కోట్ల పనులకు అనుమతులు తీసుకొచ్చామన్నారు. దీనిలో భాగంగా రూ.4.15 కోట్లతో ఖండవల్లి-ముక్కామల రోడ్డు, రూ.4.15 కోట్లతో దువ్వ-తీతలి,- మునిపల్లి రోడ్డును నిర్మించనున్నామన్నారు. సూర్యారావుపాలెం, పసలపూడి గ్రామాలకు రోడ్డు వేయనున్నామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో నియోజకవర్గంలో పంచాయతీరాజ్ నిధులు రూ.11 కోట్లతో గ్రామాల్లో అంతర్గత రోడ్లను బాగు చేయిస్తామన్నారు. మరిన్ని ప్రతిపాదనలు పంపించి మరో రూ.5 కోట్లను మంజూరు చేయించామన్నారు. ఎంపీ ల్యాడ్స్ నుంచి కొన్ని నిధులు తీసుకొని రోడ్లను బాగు చేయడంతో పాటు ఎంపీ పురందేశ్వరితో మాట్లాడి కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నామన్నారు. ఆయన వెంట కోలా సీతయ్యానాయుడు, వాకలపూడి వీర్రాజు, టి.చినబాబు, ఆర్.ప్రసాద్, ఇఇ రూత్ కుమార్, డిఇ బివి.రమణ, ఎఇ శ్రీనివాస్ ఉన్నారు.



రోడ్లను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

ట్రాఫిక్‌తో ఇబ్బందులు

ప్రజాశక్తి - గోపాలపురం

స్థానిక మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్యతో తీవ్ర అవస్థలు పడుతున్నామని స్థానికులు, ప్రయాణకులు వాపోతున్నారు. గోపాలపురం ఆర్ అండ్ బి రోడ్డును ఆనుకుని తాళ్లపూడికి వెళ్లే రోడ్డులో ప్రతి శుక్రవారం సంతను నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోతున్నాయి. ఇదే దారిలో ఫ్యాక్టరీలకు వెళ్లే భారీ లారీలు, ట్యాంకర్లు ఇసుక లారీలు నిత్యం తిరుగుతుంటాయి. వీటితోపాటు ప్రయివేటు పాఠశాలల బస్సులు వెళ్తుంటాయి. మార్కెట్ కు కూత వేట దూరంలో ప్రభుత్వ ఆసుపత్రి ఉండడంతో ఎమర్జెన్సీ కేసులు అంబులెన్స్ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ సమయంలో ట్రాఫిక్ నిలిచిపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, ప్రయాణికులు చెబుతున్నారు. దీన్ని దృష్టిల పెట్టుకుని మార్కెట్‌కు మరో ప్రాంతాన్ని కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.



శుక్రవారం మార్కెట్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ తనిఖీలు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని కొత్తపల్లి పిహెచ్‌సిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటా సర్వే చేసి వైద్య సేవలు అందించాలన్నారు. ఎంపిహెచ్ఎలను వారివారి ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది చేస్తున్న క్లోరినేషన్, సంబంధిత లాగ్ బుక్‌లు తనిఖీ చేసి పిపిఎం సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం కొత్తపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పిహెచ్‌సిని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ని తనిఖీ చేశారు. ఆయన వెంట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తిరన్, సిహెచ్ఒ జాన్సన్ రాజు, ఎంపిహెచ్ఇఒ బి.రాజు, హెచ్‌వి రాజేశ్వరి, ఎంపిహెచ్ఎలు శ్రీను, పవన్, రమణ, అప్పారావు ఉన్నారు. అలాగే కోరుకొండ, శ్రీరంగపట్నం, కోటికేశవరం పిహెచ్‌సిలను ఆయన సందర్శించారు.



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎంహెచ్ఒ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రామచంద్ర

ఉత్సాహంగా వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను పురస్కరించుకొని రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో గెయిల్ ఆధ్వర్యంలో ఎలోక్యూషన్(వక్తృత్వ) పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జిరగాయి. 'విజిలెన్స్ అవేర్నెస్ రెస్పాన్సిబిలిటీ అండ్ కరప్షన్ ఫ్రీ సొసైటీ ఈజ్ అవర్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవర్ రైట్' అనే అంశాలపై ఈ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ భాగంగా విద్యార్థుల్లో నైతికత, పారదర్శకత, బాధ్యతా భావం పెంపొందించేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. గెయిల్ హెచ్‌ఆర్ మేనేజర్ విఎస్.మూర్తి, హెచ్‌ఆర్ ఎక్స్ మేనేజర్ ఎన్ఎస్.శర్మ, సిఅండ్‌పి సీనియర్ ఆఫీసర్ జివి.రమణ, సీనియర్ సూపరింటెండెంట్ వి.ఉమాశంకర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ ఎం.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ పి.మురళీకృష్ణ, బి.భవాని, పిఆర్ఒ డాక్టర్ జె.సురేష్ సహకారం అందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.

ఉపాధి పనుల గుర్తింపు

ప్రజాశక్తి - సీతానగరం

వంగలపూడిలో ఎపిఒ బివి.సత్యవతి ఆధ్వర్యంలో, సింగవరంలో టెక్నికల్ అసిస్టెంట్ సింహాద్రి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామసభలను శుక్రవారం నిర్వహించారు. వంగలపూడిలో 34 పంట కాలువలు, ఒక చెరువు, కంపోస్ట్ పిట్లు 20, గోకులాలు 6, కచ్చా డ్రెయిన్లు, మట్టిరోడ్డు నిర్మాణ పనులు 1, మొక్కలు పెంపకం పనులు 2 గుర్తించారు. సింగవరంలో 32 పంట కాలువలు, కంపోస్ట్ పిట్లు 5, గోకులాలు 3, సోక్ పిట్లు 8 గుర్తించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఇకెవైసి చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ సంగన చినపోసియ్య, సెక్రటరీ షేక్ మీరాబి, గ్రేడ్ ఫైవ్ సెక్రెటరీ ప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్లు వీరబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు బివి.రామారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు రేషన్ సరఫరా

దేవరపల్లి : మొంథా తుపాను బాధితులకు రేషన్ పంపిణీ కార్యక్రమం మండలంలో శుక్రవారం నిర్వహించారు. మొత్తం 65 మంది నిర్వాసితులను గుర్తించారు. దేవరపల్లి 5, బంధపురం 44, గౌరీపట్నం 8, యర్నగూడం 3, యాదవోలు 5 మందికి నిత్యావసర సరుకులు అందించారు. బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ పంచదార, కేజీ కంది పప్పు, లీటర్ నూనె, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుపంలను అందించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి సొసైటీ అధ్యక్షుడు రామారావు, తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, సివిల్ సప్లయీస్ డిటి సత్యనారాయణ, ఆర్ఐ కమాల్, విఆర్ఒ లక్ష్మి, యాగంటి వెంకటరత్నం, సొసైటీ సభ్యులు కవల సీత, కొండపల్లి దొరయ్య, పి.నవీన్‌చౌదరి, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై కౌన్సిల్‌లో చర్చ

ప్రజాశక్తి-నిడదవోలు

మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అజెండాలో పొందుపరచిన వివిధ అభివృద్ధి పనులకు సంబందించిన అంశాలపై చర్చించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మాలకోడు అభివృద్ధి పనులు, వార్డుల్లో నెలకొన్న పలు సమస్యలు వైసిపి కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశం అనంతరం ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇటీవల స్వచ్ఛ భారత్ మిషన్ లో స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు పొందిన మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ను, ఉత్తమ సేవకులుగా అవార్డు అందుకున్న ప్రజా ఆరోగ్య కార్మికులు మామిడిపల్లి కృష్ణవేణి, బంగారు శ్రీహరిలను నిడదవోలు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, మున్సిపల్ సిబ్బంది శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, సంబంధిత అధికారులు హాజరయ్యారు.

కార్టూ'నిజం'



తుపాను బాధితులకు అండగా ప్రభుత్వం

ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కొవ్వూరు

మొంథా తుపాను బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మద్దూరు జడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో తుపాను బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయడంతో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. అధిక వర్షాలు, ఈదురు గాలుల కారణంగా కొంత పంట నష్టం సంభవించినప్పటికీ, జిల్లా యంత్రాంగం వేగంగా స్పందించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించిందన్నారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలిన ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా భారీ నష్టం నివారించుకునే ఆస్కారం ఏర్పడిందన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను యుద్ధప్రతిపాదికన చేపట్టారన్నారు. మద్దూరు గ్రామానికి చెందిన 15 కుటుంబాలకు, కొవ్వూరుకు చెందిన 38 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించామన్నారు. పంట నష్టం త్వరితగతిన అంచనాలు వేయించి, అవసరమైన ఆర్థిక సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆర్‌డిఒ రాణి సుస్మిత మాట్లాడుతూ తుపాను ప్రభావనికి ముందుగానే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించమన్నారు. తహశీల్దార్, సచివాలయ సిబ్బంది, పోలీసులు ఇందులో కీలక భూమిక పోషించారన్నారు. అలాగే కొవ్వూరు హైస్కూల్లో పునరావసం పొందిన బ్రిడ్జి పేటకు చెందిన 33 కుటుంబాలకు ఆయన నిత్యావసరాలు అందించారు. అనంతరం అరికిరేవులలో ఇల్లు కూలిన మారిశెట్టి సత్యనారాయణకి గ్రామ రైతులు సేకరించిన రూ.5వేల సాయాన్ని అందజేశారు. పక్షవాతానికి గురైన వి.వెంకటేశ్వరరావుకు గ్రామస్తులు సేకరించిన రూ.5వేలను అందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంపిపి నారాయుడు, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మాజీ మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి బాబ్జి, నాయకులు అధికారులు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఎంఎల్ఎ, ఆర్‌డిఒ

ఎకరాకు రూ.30వేల పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-గోకవరం

తుపాను కారణంగా నీట మునిగిన పంటలకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం ఇవ్వాలని పాటంశెట్టి సూర్యచంద్ర డిమాండ్ చేశారు. ముంపునకు గురైన పొలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతన్నలను తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్రాప్ ఇన్సూరెన్స్ కట్టిన రైతులకు పూర్తి నష్టపరిహారం, ఇన్సూరెన్స్ కట్టని రైతులకు రూ.5వేలు లేక రూ.10వేలు చెల్లించాలానే ప్రభుత్వ నిర్ణయం సరైనది కాదన్నారు. ప్రతీ రైతుకు ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలన్నారు.

అభాగ్యులకు అండగా తాడాల

ప్రజాశక్తి-కడియం

టివిసిచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. అభాగ్యులకు భరోసా కల్పిస్తున్నారు. సంపాదనలో కొంత శాతం వెచ్చించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. కడియం గ్రామానికి చెందిన గానుగుల సీతారత్నం(90) నడవలేని స్థితిలోఉంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఆయన వీల్ చైర్‌ను కొనుగోలు చేసి ఆమెకు అందించారు. వీల్ చైర్‌తో పాటు హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం కొంత నగదు, నూతన దుస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



అధికారులు పట్టుకున్న ఇసుక లారీ

రెండు ఇసుక లారీలు స్వాధీనం

ప్రజాశక్తి - కొవ్వూరు

సరైన పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి డి.ఫణిభూషణరెడ్డి, ఇసుక టాస్క్ ఫోర్స్ అధికారి ఆంజనేయులు కొవ్వూరు, వాడపల్లి గ్రామాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ లారీలను గుర్తించి పట్టణ పోలీస్ స్టేషన్‌కి అప్పగించారు. ఇవే వాహనాలు ఈనెల 8న పట్టుబడినట్లు ఖమ్మం జిల్లా కల్లూరు సబ్ కలెక్టర్ లేక ద్వారా తెలిపారన్నారు. ఈ రెండు వాహనాలు గతంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి గుండా అక్రమ ఇసుక రవాణా చేసిన కేసుల్లో పట్టు బడినట్లు తెలిపారు. ఈ రెండు వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినట్లు జిల్లా మైన్స్ అధికారి ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు.

తప్పిపోయిన మహిళల గుర్తింపు

ప్రజాశక్తి - జగ్గంపేట, కిర్లంపూడి

తప్పిపోయిన ఇద్దరు మహిళల ఆచూనీకి పోలీసులు గుర్తించారు. కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి గత 28వ తేదీ నుండి కనిపించటం లేదని ఆమె తల్లి తండ్రులు పోలీసులకు పిర్యాదు చేశారు. వీరవరం గ్రామానికి చెందిన వివాహిత 4 ఏళ్ల బాబుతో గత 17వ తేదీ నుండి కనిపించడంలేదని ఆమె బంధువులు పోలీసులు ఫిర్యాదు చేశారు. ఆ రెండు పిర్యాదుల మేరకు వారి వివరాలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్ బాబు, ట్రైనీ ఎస్ఐ రాజా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. వారు హైదరాబాద్‌లో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నట్టు గుర్తించామని, వారిని తీసుకుని వచ్చి బంధువులకు అప్పగిస్తామని తెలిపారు.

సారా తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం శివారు మండపం వద్ద ఆటోలో సారా తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ హరిబాబు తమ సిబ్బందితో గురువారం రాత్రి మండపం సెంటర్ హైవే దగ్గరలో దాడులు నిర్వహించగా ఆటోలో తరలిస్తున్న 72 లీటర్ల సారా తోపాటు నాలుగు బెల్లం బస్తాలను పట్టుకున్నారు. పెదమల్లాపురం వద్ద సారా తయారు చేస్తున్న బట్టీలపై దాడి చేసి సుమారు 1500 లీటర్ల బెల్లం ఉటతో పాటు సారా తయారీకి ఉపయోగించే వంట సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

జ్వరాలపై ఇంటింటా సర్వే

ప్రజాశక్తి-నల్లజర్ల

పోతవరం పిహెచ్‌సి పరిధిలో జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని డాక్టర్ సిహెచ్.శైలజ తెలిపారు. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో జ్వరాలు, డయేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఫీవర్ సర్వేతో పాటూ ఫ్రైడే డ్రైడేను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఎం.జయప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పి సంకీర్తన, ఎఎన్ఎం ప్రశాంతి, ఆశాలు పాల్గొన్నారు.

తుపాను సాయం అందరికీ ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తుపాను బాధితులందరికీ సాయం అందజేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. పార్టీ కార్యాలయంలో సంతోష్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలో తీరం ప్రభావం ప్రజలపై తీవ్రంగా పడిందన్నారు. వారం రోజుల పాటు ఎటువంటి పనులకూ వెళ్లలేదనానరు. కొంత మందికి సాయం అందించి ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూస్తోందన్నారు.

పరిహారం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-కాకినాడ

దుమ్ములపేటకు చెందిన గద్దేపల్లి సాయిరామ్ కుటుంబానికి నష్టపరిహారం అందించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలికి ఫిషర్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రెసింగి ఆదినారాయణ శుక్రవారం వినతిపత్రం అందించారు. సాయిరామ్‌కు ఏడాది క్రితమే వివాహం అయ్యిందని, 11 నెలల కుమారుడు, తల్లిదండ్రులతో పాటు ముగ్గురు చెల్లెళ్ల మొత్తం కుటుంబ బాధ్యత సాయిరామ్‌పై ఆధారపడి ఉందని చెప్పారు. తగిన పరిహారం అందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

ఎఒలకు ఎంపిడిఒలుగా ప్రమోషన్

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లా పరిషత్ కార్యాలయంలో పరిపాల అధికారులుగా పని చేస్తున్న ఇద్దరికి ఎంపిడిఒలుగా ప్రమోషన్ కల్పిస్తూ శుక్రవారం జెడ్‌పి చైర్మన్ వేణుగోపాలరావు ఉత్తర్వులు జారీ చేశారు. జెఎల్ఎన్.దీక్షితులు ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయంలో, జె.శ్రీనివాస్ కరప మండల పరిషత్ కార్యాలయంలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జెడ్‌పి సిఇఒ జిఎస్.రామ్ గోపాల్ పాల్గొన్నారు.

పోలీసు అమరులకు ఘన నివాళి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎపిఎస్‌పిలో కమాండెంట్ ఎం.నాగేంద్రరావు ఆధ్వర్యాన శుక్రవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. డి.మురళీ కుమార్, ఎస్.మన్మధ రావు, అధికారులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అమరవీరులకు స్థూపం వద్ద నుంచి మెయిన్ రోడ్ మీదగా ర్యాలీ నిర్వహించారు.

యానాం వార్తలు


నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ అంకిత్ కుమార్, ఎస్‌పి వరదరాజన్

ఇందిరా గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని సమాచారశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కార్యలయాల సమీపంలో యుకెవి నగర్ ఏటుగట్టు రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహాలకు పరిపాలనాధికారి అంకిత్ కుమార్, ఎస్‌పి వరదరాజన్, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్ధాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి, చెక్కల అరుణ్ కుమార్, పైడికొండల రాజబాబు, చింతకాయల జ్ఞానేశ్వర్ తదితరులు నివాళర్పించాలి.

లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసిన మల్లాడి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి రాజ్ నివాస్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాశనాథన్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించినట్లు మల్లాడి తెలిపారు. తుపాను కారణంగా నష్టపోయిన ప్రజలను, రైతులను ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్ చంద్ర చౌహాన్, కలెక్టర్ కులోత్తుంగన్ తదితరులను కలిసినట్లు తెలిపారు.

నేడు పుదుచ్చేరి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

శనివారం పుదుచ్చేరి విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆర్ఎఒ అంకిత్ కుమార్ జాతీయ జెండా ఆవిష్కరిస్తారని, అనంతరం విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు ఉంటాయని సమాచారశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం జాతీయ జెండా ఆవిష్కరణ, గాడ్ ఆఫ్ హానర్, శాంతి కపోతాలు ఎగుర వేయడం, ఆర్ఎఒ ప్రసంగం, మార్చ్ ఫాస్ట్, బహుమతుల ప్రదానం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.


చెక్కు అందిస్తున్న చల్లా శంకరరావు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎ-తరగతి సభ్యులు కొర్రపాటి ఎన్.శివ ప్రసాద్ రోడ్డు ప్రమాదంలోమరణించడంతో బ్యాంకు తరుపున రూ.లక్ష ఆర్థిక సాయాన్ని బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు మృతుని తల్లి సామ్రాజ్యంకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రమాద బాధితులకు ఆర్యాపురం బ్యాంకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కప్పల సూర్యప్రకాష్, పిల్లి శ్యామ్ కుమార్, యర్రమోతు ధర్మరాజు, పడాల శ్రీనివాస్, ముదిగి శ్రీనివాసరావు, నీలపాల సూర్య సత్యనారాయణ, బి.రవికుమార్, యాళ్ళ వెంకట్రావు, ఎస్.రామకృష్ణ, టి.నిర్మల, సహాయ సెక్రటరీ తాడేల శ్రీనివాసరావు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు,

ఎంఎస్ఎన్ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్థానిక జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ చారిటీస్‌కు సంబంధించి రెండేళ్ల కాలానికి నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయక్ చైర్మన్‌గా వ్యవహరించారు. ధర్మకర్తలుగా నులుకుర్తి సత్య సాయి, ముగు చిన్ని, దుర్గాప్రసాద్ పిల్లారి శెట్టి, రాళ్లపూడి ప్రకాష్, పిర్ల లక్ష్మీప్రసన్న, అరదాడి భవాని, ఓలేటి దుర్గ, మందపాక త్రిలోచన, ధూళిపాల సూర్య భగవాన్‌లతో ఇఒ బళ్ల నీలకంఠం ప్రమాణ స్వీకారం చేయించారు.

రక్తదానం చేసిన ఎస్‌పి బిందుమాధవ్

ప్రజాశక్తి-కాకినాడ

పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్‌పి జి.బిందుమాధవ్, ఎఎస్‌పి దేవరాజ్ మనీష్ పాటిల్ శుక్రవారం రక్తదానం చేశారు. పోలీస్ అమరవీరుల స్మారక కార్యక్రమాల్లో భాగంగా కాకినాడ పోలీస్ కన్వెన్షన్ హాల్లో ఈ రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి శ్రీనివాస్, ఆర్ఐ, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ఆదిత్య కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి-కాకినాడ

ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు 35 యూనిట్ల రక్తదానం చేశారని కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా చివరి రోజు రక్తదాన శిబిరం నిర్వహించారు. స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ మహమ్మద్ షాహిద్దీన్ రక్తదానం చేసి, విద్యార్థులను కూడా ప్రోత్సహించారు. వీరిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -కరప

కరప జూనియర్ కళాశాలలో 56 మంది విద్యార్థులకు ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు అందకపోవడంతో పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. పదో తరగతి 2023-24 బ్యాచ్‌కు చెందిన నక్కా సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యాన పూర్వ విద్యార్థులు పెంకే నూకరాజు, నానాజీ, తుట్టా నరేష్, నక్కా భీమశంకర్, పోలిశెట్టి సునీల్, సలాది విజయ్ బాబు, భగవాన్, తుమ్మలపల్లి సత్యనారాయణ, కళాతులసి, పద్మిని పాఠ్యపుస్తకాలు కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాతీలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్వక విద్యార్థులను అభినందించారు.

రైతులందరికీ పరిహారం అందేలా కృషి

ప్రజాశక్తి- తాళ్లరేవు

తుపానుతో నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించేలా కృషి చేస్తామని పలువురు నాయకులు తెలిపారు. మంజేరు డిసి వైస్ చైర్మన్ కొత్తూరు కాశీఈశ్వరుడు, టిడిపి నాయకుడు భజన సత్తిబాబు, దంగేటి అన్వేష్, జనసేన నాయకుడు బోణం శ్రీనివాస్, గుండుపల్లి శ్రీనివాస్ వ్యవసాయ సహాయకులతో కలిసి నేలకొరిగిన పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో చాలా వరకూ పంట నష్టం జరిగిందని తెలిపారు. జరిగిన నష్టాన్ని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్ మాధూర్‌కు వివరించి పరిహారం వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.

సత్యదేవుని దర్శించుకున్న గరికపాటి


శంఖవరం : అన్నవరం సత్యనారాయణ స్వామిని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహామూర్తి శుక్రవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన గరికపాటికి దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు ఆలయ లాంఛనాలతో స్వాగతించారు. అనంతరం గరికపాటి దంపతులు స్వామివారి వ్రతాన్ని ఆచరించి దర్శించుకున్నారు.

తుపాను బాధితులకు అండగా ప్రభుత్వం

ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి

ప్రజాశక్తి - రాజమహేంద్ర వరం రూరల్

తుపాను బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. శుక్రవారం హుకుంపేట డి-బ్లాక్ వద్ద ఆర్‌డిఒ కృష్ణనాయక్‌తో కలిసి తుపాను బాధితులకు ఆయన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ హుకుంపేటలో ప్రధానంగా రెండు సమస్యలను గుర్తించామన్నారు. వడియంపేటలోని సమస్య పరిష్కారానికి, అలాగే కరెంటు లైన్ల కింద ఉన్న కుటుంబాలకు టిడ్కో ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు చేపడతామన్నారు. హుకుంపేటకు చెందిన 71 కుటుంబాలకు, సాటిలైట్ సిటీకి చెందిన 5 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. ఆర్‌డిఒ కృష్ణనాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల తుపాను నుంచి స్వల్ప నష్టాలతో బయటపడ్డామన్నారు. నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. త్వరలోనే తుపాదు బాధితులకు ఒక్కొక్కరికి రూ.వేయి చొప్పున, కుటుంబానికి గరిష్టంగా రూ.3వేల సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎఎస్ఒ ఆంజనేయులు, సర్పంచ్ దుద్దుపూడి రమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల

ఎపిఎన్‌జిఒ సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం యూనిట్‌లో ఎన్నికల షెడ్యూల్‌ను అడహక్ కమిటీ జిల్లా చైర్మన్ మీసాల మాధవరావు శుక్రవారం ప్రకటించారు. ఎన్నికల అధికారిగా నిడదవోలు యూనిట్ అధ్యక్షులు నందీశ్వరుడు, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా నిడదవోలు యూనిట్ కార్యదర్శి కె.జయంత్ వ్యవహరించనున్నారు. ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా జిల్లా కో చైర్మన్ ఎస్.ప్రవీణ్ కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ ఎన్నికలు నవంబర్ 15న జరుగుతాయన్నారు. 2వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ ఓటర్ల నమోదు ఉంటుందన్నారు. రాజమహేంద్రవరం, కడియం మండలాల సభ్యులు మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. 6వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 2గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

నవంబర్ 1వ తేదీ ఉదయం నుంచే గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. జిల్లాలో మొత్తం 2,35,031 మంది లబ్ధిదారులకు రూ.103.17 కోట్లను పంపిణీ చేయనున్నట్లు తెఇపారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. పింఛను పంపిణీలో 4,975 మంది సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు.


క్రీడాకారులతో హెచ్ఎం తదితరులు

రాష్ట్ర స్థాయి పోటీలకు చిట్యాల విద్యార్థులు

ప్రజాశక్తి - గోపాలపురం

నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు చిట్యాల హై స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం వైఎస్ఎన్.మూర్తి తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థి పి.ధనుష్, ఎనిమిదో తరగతి విద్యార్థి ఆర్యఆనంద్ కొవ్వూరులో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ అండర్ 14 విభాగంలో ప్రతిభ చాటడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులను ఎస్ఎంసి చైర్మన్ కృష్ణ, పలువురు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. నవంబర్‌లో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు బి.సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంతా శ్రీను, డి.అరుణకుమారి, వై.అంబేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళి

నిడదవోలు : మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఆ పార్టీ నిడదవోలు నియోజకవర్గ కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. చర్ల సుశీల వృద్ధాశ్రమంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పండ్లు, మిఠాయిలు, బిస్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, బండి అభిషత్తుడు, దరపురెడ్డి సుజాత, కాకి కిషోర్, కళ్లెం ఆనందరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఏలేరు జలాల విడుదలతో ఇబ్బంది లేదు

సామర్లకోట : ఏలేరు జలాలను విడుదల చేసినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరదను కట్టడి చేయగలిగామని ఏలేరు ఇరిగేషన్ ఎస్ఇ గోపీనాథ్ వెల్లడించారు. సామర్లకోట ఉప్పు వారి సత్రం వద్ద పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువ పెద్దవంతెన వద్ద లాకుల వద్ద ఉధృతిని ఆయన శుక్రవారం పరిశీలించారు.

వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - సీతానగరం

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను నిరసనిస్తూ వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వమించారు. సింగవరం నాగరత్నం కాలనీలో ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాసరావు. పెదకొండేపూడిలో సీనియర్ నాయకులు పెందుర్తి దేవదాసు, సీతానగరం సర్పంచ్ కొండ్రపు ముత్యాలు. మిర్తిపాడులో రాష్ట్ర వాలంటరీ వింగ్ జాయింట్ సెక్రెటరీ పెదపాటి రమేష్‌బాబు. వెదుళ్లపల్లి, రాజంపేట గ్రామాల్లో మండల కో-కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, వైస్ ఎంపిపి సత్యంమదన్‌మోహన్‌బాబు, పిచ్చుకుల విజయ్ కుమార్ సంతకాలను సేకరించారు.

నేలటూరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - చాగల్లు

నేలటూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం వైసిపి కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైసిపి సీనియర్ నాయకులు గెడ శ్యాంసుందర్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తలారి వెంకటరావు మాట్లాడారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయలేని ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మట్టా వీరస్వామి, జె.ఏడుకొండలు, జి.సురేంద్ర, ఇంటి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు

సీతానగరంలో 'ఓపెన్ హౌస్'

ప్రజాశక్తి - సీతానగరం

పోలీస్ అమరవీరుల దినోత్సవంలో భాగంగా పోలీసులు శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమన్ని నిర్వహించారు. ఎస్ఐ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ట్రైనీ ఎస్ఐ బి.సురేష్ ఆధ్వర్యంలో జ్ఞానిధి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు

పొలాలను పరిశీలించిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - చాగల్లు

తుపాను కారణంగా చాగల్లు గ్రామ శివారు ముంపునకు గురైన పంటలను వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు శుక్రవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జి.సురేంద్రకుమార్, జుట్టా ఏడుకొండలు, ఎం.వెంకటరావు, బొర్రా రజనిప్రసాద్, ఇంటి వీర్రాజు, బొర్రా కృష్ణ, జి.శ్యాంసుందర్, టి.నాగమణి తదితరులున్నారు. .

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ సతీమణి నా సేన కోసం నా వంతు రాష్ట్ర కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతుల మీదుగా సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. ముగ్గళ్లకు చెందిన కూచిపూడి భానుమూర్తి, నామాల వీరవెంకటసత్యనారాయణ, రాజంపేట గ్రామానికి చెందిన కవల విజయకుమారి, సింగవరం గ్రామానికి చెందిన బోడపూడి ప్రసాదరాజు, చిన్న కొండేపూడికి చెందిన బొమ్మిరెడ్డి సత్యనారాయణలకు అందించారు.


మహాసభలో మాట్లాడుతున్న నాయకులు

భవన కార్మికుల మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

భవన నిర్మాణ కార్మికుల జిల్లా 2వ మహాసభలు శుక్రవారం జగ్గంపేటలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులు నిర్వహించనున్న సభల్లో తొలి రోజు స్థానిక పంచాయితీరాజ్ అతిథి గృహం వద్ద కళాకారులచే సాంస్కతిక ప్రదర్శనలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క సత్తిబాబు, సీనియర్ నాయకులు బోర సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, మండల అధ్యక్షుడు కొల్లు సత్తిబాబు, కార్యదర్శి కెంగం దుర్గ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పివివి.సత్యనారాయణ, మండల అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు నండ్ల చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు లేవని కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు శుక్రవారం గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత ఎజెండాలోని అంశాలపై కౌన్సిలర్లు మైనం భవాని, మొగలి దొరబాబు, గుల్ల సుబ్బారావు మాట్లాడారు. నగర పంచాయతీ పరిధిలోని సూరంపేట ఏరియాకు వాటర్ ట్యాంక్ ద్వారా 128 రోజులకు 221 కుటుంబాలకు రూ.5 లక్షల ఖర్చవుతుందని, అలాంటప్పుడు అక్కడే ఒక బోరు వెయ్యాలన్నారు. 2016, 2017-18లో ఇంకుడు గుంతలు పనులకు ఇప్పుడు బిల్లులపై అభ్యంతరం వ్యక్తం చేశారు వాటిని వాయిదా వేయాలని కోరారు దీంతో కమిషనర్ అహ్మద్ అలీషా వాటిని వాయిదా వేశారు అనంతరం మూడవ వార్డులో అభివద్ధి పనులు నోచుకోవడం లేదని పట్టణంలోని హిందూ స్మశాన వాటిక దాతల సహకారంతో నిర్మించుకున్న దానిలో పారిశుద్ధ్య పనులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రాజోలు

పోలీసుల సేవలు అభినందనీయని , మన రక్షణకోసం నిరంతరం పనిచేస్తూ మనకు అం దుబాటులో ఉంటారని రాజోలు ఎంఎల్ఎ దేవ వం ప్రసాద్ అన్నారు. శుక్రవారం పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబాలకు సంఘీభావంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదలాడకు చెందిన కోళ్ల వెంకన్న సిఆర్‌పిఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఛత్తీస్‌ఘడ్ ల్యాండ్ మైన్‌లో మృతి చెందారని వారి సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజోలు సిఐ నరేష్‌కుమార్, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.